# తిట్లదండకం

అశుభ దినములందునన్, కర్తరిన్, శూన్యమాసంబునం, భౌమవారంబునన్, రాహుకాలంబునన్, దుర్ముహూర్తంబునన్, సర్వపాపగ్రహంబుల్, సమూహంబుగా గూడి నీ జన్మలగ్నంబు వక్రంబుగా జూచు కాలంబునన్, నాకు పన్లేమియున్ లేక, పాలేమియున్ బోక, చీకాకుగా నొంటిగా నేను గూర్చున్నచో ; నీవు నన్ జేరగా వచ్చి, ఆ మాట ఈ మాట మాట్లాడుచుండంగ, ఆ దీర్ఘ సంభాషణంబందు , నా తోడ కించిత్తమర్యాదగా బల్కినా, వందుచే నాకు నీ పైన కోపంబు రేకెత్తి, రూపించి, దీపించి, జృంభించె; ఆ కోపమే చిత్రవాక్య ప్రకోపంబు గా మారి, నిన్ దిట్ట గా నన్ను ప్రేరేపణన్ జేసె, నద్దాన నిన్ నేను దూషింపుచున్నాను , గానందులో కొంత నవ్యత్వమున్, కొంత భిన్నత్వమున్, కొంత హాస్యంబు జోడించి , ముప్పేటగా కూరి దట్టింపగా గోరి, నీ పైన నే తెల్గులో తిట్లతో దండకంబొండు గల్పించెదన్, నీ అపఖ్యాతి  నాచంద్రతారార్క మీ ఆంధ్ర భూమిన్ మహా హాస్యపాత్రంబుగా నిల్పెదన్; ముందుగా 'విఘ్నరాజాయ తే వందనం' బంచు నా గుజ్జు వేల్పైన విఘ్నేశ్వరున్ గూర్చి ధ్యానించి, 'మాతర్నమస్తే మహావాక్య నిర్మాణశక్తిం సదా దేహి మహ్యం త్వ' మంచున్ సరోజాసనాస్యస్థితన్ వాణి బూజించి , ఆ పిమ్మటన్ ; వశ్య వాక్కై ప్రవర్తిల్లి  ప్రఖ్యాతుడైనట్టి భీమన్ననున్; కొంటె కోణంగియౌ రామలింగాఖ్యునిన్ ; దూషణప్రజ్ఞలో  అగ్రణిన్ జగ్గనన్; తెల్గులో తిట్లతో దండకంబున్ రచింపంగ నాద్యుండు వోల్పేద్ది వెంకన్ననున్ చిత్తమందెంచి, మన్నించి, అవ్వారి ఆశీస్సులన్ గాంచి, తల్లబ్ధ విద్యాప్రభావంబుచే, అట్టి పూర్వాంధ్ర విద్వత్కవీంద్ర ప్రకారంబుగా చెప్ప నుత్సాహమున్ బూని, నానాప్రకారంబులన్ నిన్ను దిట్టంగ నేదిట్ట నై లేచితిన్, చూచుకో, కాచుకో, తిట్లసంఖ్యాకమై , అద్భుతంబై, అమోఘంబుగా, చారుఘోరంబుగా, దుర్నివారంబుగా, భర్గశీర్షప్రవద్దివ్యగంగా ప్రవాహోచ్ఛలత్తుంగరంగత్తరంగోగ్రవేగంబుతో పుట్టుచున్ వచ్చి, పోటెత్తి ఉప్పొంగి, పెన్ వెల్లువై పారి, ముంచెత్తురా నిన్ను, నా మాట నిక్కంబు, నా చేతికిన్ జిక్కినావిక్కడీరీతిగా నీ, వొరే వజ్రశుంఠా, ఒరే భేకకణ్ఠా, ఒరే కుష్ఠు కుక్కా, ఒరే కొంకినక్కా, ఒరే ముళ్ళపందీ, ఒరే కఱ్ఱె బఱ్ఱే, ఒరే బొంత నల్లీ, ఒరే నల్లబల్లీ, ఒరే జంగుపిల్లీ, ఒరే బక్క ఎద్దూ, ఒరే శుద్ధ మొద్దూ, ఒరే బొచ్చు చింబోతుగా, ఎందుకుం బన్కి రానట్టి నిర్భాగ్యుడా, వట్టి దౌర్భాగ్యుడా, కొండి లేనట్టి తేలా, అరే కోర లేనట్టి పామా, అరే మూపు లేనట్టి ఒంటే, అరే చెండు లేనట్టి ఎద్దా, ఒరే  కుక్కలున్, నక్కలున్, గద్దలున్, బారువల్, గుడ్డితోడేళ్ళు, రాబందులున్ , ముట్టగానైన, మూచూడగానైన బోనట్టి చండాలపున్ పీనుగా, నీదు జన్మంబు వ్యర్థంబు, నీ జీవితంబే నిరర్థంబు, నిన్ బారు గుండ్లేసి కాల్చా, నినున్ కత్తితో జీల్చ, నిన్ కాటిలో గాల్చ, నీ శ్రాద్ధమున్ చాకి రేవందునన్ బెట్ట, నీ పిండముల్ కుక్క ముట్టా, నినున్ తేలు గుట్టా, నినున్ పాము ముట్టా; ఒరే నిన్ను మిన్నాగు దాకా; ఒరే నీపయిన్ పేడతట్టెత్తి పెట్టా, నినున్ జూచి ఊరంత ఉమ్మేయ, నీ మోముపై పేడ కళ్ళాపి జల్లా, బజారాడవాళ్ళంత నిన్ జూచి నవ్వా, జనాలందరున్ నీ పయిన్ మూగుచున్ గేలి చప్పట్లు గొట్టా, నినున్ జావగొట్టా, నినున్ బొందలోబెట్టి పూడ్చా; ఒరే నీకు గోర్చుట్టులున్ చేతిలో జెట్టలున్ బుట్ట, సర్వరోగంబులున్ కట్టగా వచ్చి నీకంట; నీ కళ్ళు పీకించెదన్, పళ్ళు రాల్పించెదన్, బొచ్చు పీకించెదన్,

ముక్కు చెక్కించెదన్, నాల్క కోయించెదన్, తిత్తి తీయించెదన్, తోలు నొల్పించెదన్, డొక్క జీల్పించెదన్, డోలుగట్టించి వాయించెదన్ చూడరా; నీకు నీ పాపమే శాపమై నిన్ను సాధించి, వేధించి, నీ అంతమున్ జూచు గానీ, ఒరే నీవు చావద్దురా, నిండు నూరేళ్ళు మాత్రంబె కాదింక వందేళ్ళు జీవించురా, కాని మామూలు గా కాదురా; మంచమే లోకమై, చీకుపై, ఎల్ల లోకానికిన్ లోకువై, కుంటివై , కాలుచేయార్పగా లేక, ఏదేమియో చూడగాలేక , మర్యాద శూన్యంబుగా, సర్వదైన్యంబనూనంబుగా, నిత్యసిద్ధావమానంబుగా, కుంకలన్ కుంకవై, లెంకలన్ లెంకవై, ముండలన్ ముండవై, దొంగలన్ దొంగవై, పాపులన్ పాపివై, భ్రష్టులన్ భ్రష్టువై, జెష్ఠలన్ జెష్ఠవై, తొట్టిలో చెత్తవై, మట్టిలో నత్తవై, కుళ్ళుకోనేటిలో నీటిలో నాచువై, మెట్లపై పాచివై, రొచ్చులో కప్పవై, బోడి గంగెద్దు పై బొంతవై, చచ్చు సన్నాసి వై, కుళ్ళు కూనిష్ఠివై, రొష్ఠు రోగిష్ఠివై, ఎందు దిక్కున్ దివాణంబు లే, కెక్కడన్ బల్కరింపంగ నొక్కండు నున్ లేక, బైరాగివై, జోగివై, దేబెవై, ఓబవై , దూబవై,బూది బుస్సన్నవై, కోయ వై, బోయవై, ఎడ్డె ఏబ్రాసివై, మడ్డి మాతంగివై, అందరున్ నిన్ను ఛీ కొట్టుచుండంగ, సిగ్గెగ్గులున్ లేక, మానావమానంబులున్ లేక, సాక్షాచ్ఛలత్ప్రేతమై, తుచ్ఛ జీవచ్ఛవంబై, దిగుల్ గ్రమ్మగా, గుండె పేలంగ, దీనాతిదీనుండవై, భాగ్యహీనుండవై , బంధుదూరుండవై, పంక్తి బాహ్యుండవై, సర్వ భ్రష్టుండవై నిల్చి; చావున్ బ్రతీక్షించుచున్ కాలమున్ పుచ్చరా, చచ్చుగా, పుచ్చుగా, తొక్కగా, తోలుగా, బొచ్చుగా, బోడిగా, లేకి సోంబేరిగా, నీదు సర్వస్వమున్ వమ్మగున్, నీచుడా, పాపుడా, దుష్టుడా, భ్రష్టుడా, కష్టుడా, నీకిదే చేటుకాలంబురా, కూసు కుంకా, అనాకారి బొచ్చా, దగాకోరు లుచ్ఛా, లఫంగా,వికారీ, బికారీ! కవుల్ దేవతాస్తోత్రముల్ జేయగా వాడియున్నట్టి ఈ దండకప్రక్రియన్ , నేను నీ బోటి లోకాయనున్ దిట్టగా వాడితిన్, దానిచే నాకు పాపంబు చేకూరినన్ లెస్స చేకూరనీ, కూళ, నీ బోటి నీచాత్మునిన్ జూచుకంటెన్ మహాపాపమేముండురా, ఇంకపోరా, మహా వ్యర్థుడా, తుచ్ఛుడా పొమ్ము పో పొమ్ముఛీ పొమ్ము రా .